

# ఆలయంలో రాధ

కథానిక

"పార్థసారథి ఆలయానికి దగ్గరలో మనకి ఒక యిల్లు చూసి వచ్చాను లలితా! అద్దె విషయం ఇంకా తేలలేదు. సాయంకాలం వెళ్ళి ఇంటి యజమానితో మాట్లాడతాను." అని ఆయన అనగానే ఒక్కసారి నాలో ఏదో భయమూ, ఆవేదనా కలిగాయి. "ఆలయానికి సమీపంలో, ఆలయంలో గంటలు అనుక్షణం వింటూ,.. నేను భరించగలనా?" అనిపించింది. అంతటితో ఆలోచనలు కదిలి స్మృతుల పరిభ్రమణంలో కొన్ని సంవత్సరాలక్రింతం జరిగిన సంఘటనలదగ్గర నిలిచి పోయాయి...

...అప్పుడు మా నాన్న ఆ వూళ్లో స్కూల్ టీచరుగా వుండేవారు. నేనూ రాధా ఒకే క్లాసు చదువుతున్నాము. ప్రతిరోజు సాయంకాలం నేనూ, రాధా, మా నాన్నా కలిసి వేణుగోపాల స్వామి ఆలయానికి వెళ్లేవాళ్ళం. చంద్రకాంత పువ్వులు జడల్లో, పొగడలు దండలుగుచ్చి ఆలయంలో స్వామికిచ్చేది రాధ... అర్చకుడు స్వామికి హారతిచ్చేసమయంలో మానాన్న మా యిద్దరిచేత నూరుసార్లు గంటకొట్టించేవారు. ముగ్గురం కలసి ఆలయంచుట్టూ నూరుసార్లు ప్రదక్షిణం చేసేవాళ్ళం. స్వామికెదురుగా నుంచుని శ్రావ్యమైన కంఠంతో రాధ పాడుతూంటే మంత్రముగ్ధులవలె మేము శరీరమంతా చెవులు చేసుకుని వినేవాళ్ళం. గుడి మంటపంలో కూర్చో బెట్టి మానాన్న నాకూ రాధకీ కథలు చెప్పేవాడు. కథలు వింటూ చిలిపిగా కొంటెగా ప్రశ్నించేది రాధ...స్కూల్లోనూ అలాగే అల్లరి చేసేది. కాని రాధ అల్లరి చిలిపితనం స్కూల్లో అందరినీ ఆకర్షించేదికాని విసిగించేదికాదు. గుళ్లో అర్చకుడు కొంటెగా అడిగేవాడు "రాధా! నీ కృష్ణుడేడమ్మా?" అని. ఆ మాట వినగానే రాధ నవ్వేది...కిలకిలా నవ్వేది. సెలయేటి ప్రవాహపు సవ్వడిలా హాయిగా నవ్వుతూ గుళ్లోనుంచి పారిపోయేదిరాధ. అర్చకుడు అడిగే ఆ ప్రశ్న రాధకి చక్కలిగింతలా పనిచేసి అంతగా నవ్వించేది. రాధ నవ్వులపిల్ల. పాటలపిల్ల. రాధపాటలు, నవ్వులు నన్ను ఆకర్షించి మా చెలిమిని పెంపొందించాయి.

రాధకి పెళ్ళి నిశ్చయమయిందని తెలియగానే నా కెందుకో వెంటనే వెళ్ళి చూడాలనిపించింది... రాధ ఒక చిత్రకారుణ్ణి కోరివరించి వివాహంచేసుకుంటోందిట. పెళ్లికూతురు ముస్తాబులోఅల్లరిపిల్ల రాధని-నుదుట కల్యాణతిలకం, కాళ్ళకి పారాణి, బుగ్గనిచుక్క, కళ్ళకి కాటుకతో తెరవెల్లా మాటున బుట్టలోంచి పెళ్ళిపీటలమీద అడుగుపెట్టే రాధని—మనఃఫలకంమీద చిత్రించుకుని మురిసిపోయాను ... మానాన్న నవ్వుతూ చెప్పాడు—"రాధ తల్లితండ్రులతో పోట్లాడి తనే సంబంధం కుదుర్చుకుందని"...పెళ్ళికి మేమంతా తరలివెళ్ళాం. పెళ్ళినాడు సాయంకాలం రాధ వీణాగానం. పెళ్ళిపందిరంతా జనంతో నిండిపోయింది. ఎత్తయిన వేదికమీద తెల్లపట్టుచీరతో, పెళ్ళికూతురు ముస్తాబుతో వెలిగిపోతోంది రాధ.

వి. ప్రభావతి

ఆమె ప్రఫుల్లవదనంలో ప్రపంచంలోవున్న తృప్తి, శాంతి, రాజసం, హాయలు, తొణికిసలాడు తున్నాయి. మోహనరాగం ఆలాపించి "నను పాలింపా" కృతిని వీణమీద వాయిస్తోంది... రాధ సృష్టించుకుంటున్న మధురరాగాలు, కల్పిస్తున్న వివిధస్వరాలు ఆమెనే వివశురాలిని చేస్తున్నాయి. ఆమెకు తన హృదయమే వీణగా మారింది. వీణతంత్రులన్నీ సెలయేళ్లుగా మారి చెంగు చెంగున దూకుతూ స్థాయినుంచి స్థాయికి పరుగులు తీస్తున్నాయి...రాధనిచూసి నిజంగా ఉప్పొంగి పోయాను...

"రాధా"

"ఆఁ" స్వర్గంనుంచి వచ్చినమనిషిలా జవాబు.

"రాధా! మీ ఆయన రవికి వుద్యోగం?"

"ఉద్యోగమేమీ చెయ్యటంలేదు. అతను కళారాధకుడు లలితా! అతని చిత్రకళానైపుణే నన్నూ ఆకర్షించింది."

"కళ భోజనం పెడుతుందా రాధా? అతన్ని వివాహం చేసుకుని నువ్వేం సుఖపడతావు?" చిలిపిగా ప్రశ్నించాను.

"లేదు లలితా! రవి నిత్యనూతనుడు. ఎప్పటికప్పుడు నూతనశోభలను సృష్టించి పరిపూర్ణత కోసం ప్రయత్నించే కళాపిపాసి. అతని సంపాదన గురించి నేను ఎన్నడూ ఆలోచించలేదు. నా సహచర్యం అతని చిత్రకళా నైపుణికి వన్నె తెచ్చి, అతనిలోవున్న కళాపిపాసకు ఒక స్పష్టమైన రూపాన్నిస్తుందని ఆశిస్తున్నాను లలితా! అతని కుంచె నాపాలిట సమ్మోహనాస్త్రమయింది. ఇక అతనిచేత నేను అనేక చిత్రాలు గీయించగలను. అహర్నిశలు అతని సాన్నిధ్యంలోనే వుండి కుంచె నడిపిస్తాను. అతని చిత్రాలలోని ప్రతి అంశము ప్రతి వర్ణము ఈ విషయాన్ని చాటి చెప్పాలి. అప్పుడేనాకు ఆత్మానందం కలుగుతుంది. ఆవిధంగా హృదయాలను పెనవేసుకుని జీవితాన్ని ఒకమధుర స్వప్నంలా గడిపివేయాలని వుంది లలితా!" రాధని మనస్సులోనే అభినందించాను. ఆమె ఆశయం కొనసాగించమని భగవంతుణ్ణి మనసారా ప్రార్థించాను...

రెండు సంవత్సరాల అనంతరం మళ్లీ రాధని కలుసుకున్నాను...కాని రాధముఖంలో ఆ నవ్వు ...ఆమెలో వెనుకటి చైతన్యం లేదు. ఆమె ప్రశాంత గంభీర వదనంలో ఏవో విషాదచ్ఛాయలు ఆవరించాయి...ఎప్పుడూ ఏదో ఆలోచనతో ఒంటరిగా గడపటానికే ప్రయత్నించేది... ఒక రోజున సంభాషణలో పరధ్యానంగా నాతో అనేసింది; "ఏమిటో లలితా! అంతా భ్రాంతికాని ఎవరికీ ఎవరూ లేరు. మనమందరం ఒంటరివాళ్లమే. అందరి గమ్యం ఒకటే అయినా, ఒకరి మనస్సు ఇంకొకరికి కర్థంకాదు; ఒకరి భాష మరొకరి కర్థం కాదు...అందువల్ల మన ప్రయాణం కలిసి మెలిసి కాదు. ఒంటరిగానే!..." ...ఆమాటలు వింటూ రాధవంక చూస్తే—ఆమె శుష్కదేహం, ఖిన్న వదనం నాకేమిటో భయం కలిగించాయి...రాధ ప్రకృతి ఇలా మారిపోయిందే! ఈమెలో ఇంత మార్పు ఎలావచ్చింది? ఆమెనంత తీవ్రంగా బాధ పెడుతున్న విషయమేమిటో? ఏమిటీ నిర్వేదం! సాహసించి ఒకటి రెండు ప్రశ్నలు వేశాను. కాని రాధ చప్పున హృదయ కవాటం మూసేసుకుంది... మళ్లీ రాధని కలుసుకో లేదు....

——నెలతరువాత నేను సెలవులకి ఇంటికి వెళ్లగానే రాధభర్త చనిపోయాడని మానాన్న చెప్పిన వార్త నాహృదయంలోంచి బాణంలా దూసుకు పోయింది...ఆనాటి రాధ నిర్వేదానికి కారణం అప్పుడు అర్థమయింది...మా నాన్న ఇంకా చాలా చెప్పాడు—"రవి ఆర్థిక సమస్య నెదుర్కోలేక చిత్రకళకి స్వస్తి చెప్పి పట్నంలో ఏదో ఉద్యోగం సంపాదించి రాధతో అక్కడ కాపురం పెట్టాడట. రాధ మామగారు చిన్న కొడుకుని కూడా చదువుకోసం వీళ్లకే వప్పగించి, "వాడి బరువు బాధ్యతలన్నీ మీవే అమ్మాయీ! వాణ్ణి జాగ్రత్తగా చూడండి" అన్నాడట. 'అలాగే! మామగారూ! అతని సౌఖ్యం తరవాతనే మా సౌఖ్యం చూసుకుంటాము"అని చెప్పిందట రాధ.... తరువాత ఆ దంపతులిద్దరూ ఆర్థికంగా అనేక బాధలకు గురి అయ్యారు. క్రమంగా రవి ఆరోగ్యం పాడై మంచమెక్కాడట. ఒకసారి చూడటానికి వెళ్ళి మా నాన్న రాధతో అన్నాడట,"ఏమమ్మా! ఇంత అవస్థపడుతున్నారు. అత్తవారు స్థితిపరులే

కదా! వారి సహాయం అడగరాదా?" అని. అందుకు రాధ చిరునవ్వుతో, "ఏదయితే మనకి హృదయ పూర్వకమైన వాత్సల్యంతో రాదో దానిని సంతోషంగా వదులుకోవడం మంచిదిగదా బాబుగారూ!" అన్నదిట. చివరికి రాధ ఎక్కడో చిన్న ఉద్యోగం సంపాదించి డబ్బుగడిస్తూ, భర్తని ఆస్పత్రిలో చేర్పించి వైద్యం చేయించిదట. ఇంట్లో చాకిరీ చేసి, పగలంతా ఆఫీసుపనిచేసి, రాత్రిళ్ళు నిద్ర మానుకుని భర్తకి పరిచర్యలు చేసేదిట. అహర్నిశలు శ్రమపడుతూ రాధ ఓరిమితో ధైర్యంతో కష్టాల్ని ఎదుర్కొంది. రవిని కంటికి రెప్పగా కాపాడుతూ ఎలాగయినా బతికించుకోవాలని ఆఖరిక్షణంవరకు మృత్యువుతో పోరాడింది..... తన జీవితంలో విలువైనవన్నీ భర్తకోసం త్యాగంచేసింది... కాని భగవంతుడు మెచ్చలేదు... చివరికి రవి అతని పెన్నిధి అయిన రాధ ఒడిలోనే చిర విశ్రాంతి పొందాడు...పాపం! రాధ ఒంటరిదయిపోయింది...రాధకి జీవితంలో ఇంకేం మిగిలాయి—కన్నీళ్ళు మినహా...ఒక కళావేత్తని భర్తగా పొందాననీ, తన జీవితం స్వర్గతుల్యమనీ ఆనందించిన రాధ, తన సర్వస్వము భర్తకోసం త్యాగం చేసిన రాధ, సానుభూతికూడా కరువై ఒంటరిగా దుఃఖించిందట. రాధజీవిత కథనం అవాచ్యంగా పరిసమాప్తి అయింది. ఆమె కలలన్నీ కరిగిపోయాయి. కట్టుకున్న ఊహా సౌధాలన్నీ కూలిపోయాయి. తెర వాలిపోయింది... జీవితంలో పూర్తిగా దగాపడిన వ్యక్తి రాధ. ఎప్పుడు ఆలయంలో గంటలు విన్నా, ఎక్కడ చంద్ర కాంతాలు చూసినా, ఆలయంలో రాధ, రాధ విషాదాంత జీవితకథనం, స్మృతికివచ్చి మనస్సు కలతపడుతుంది.

---

స్కెచ్

# సగం స్వాగతం

## కె. రామలక్ష్మి

గోడకి కొంత ఎత్తునుంచి గది కప్పుదాకా వున్న కటకటాలకేసీ, దూలాలనుండి వింతగా వేలాడుతూన్న బూజుకేసీ, మూలలని వున్న సాలిగూళ్ళకేసీ చూస్తూ ఏదో తనకే తెలియని వాటిని గురించి ఆలోచిస్తున్న రామయ్య పంతులికి వీరాస్వామి పిలుపు భయంకరంగా తోచింది.

"ఏమిటి బాబూ అలా ఆలోచిస్తున్నావు? అయినా అలా ఆలోచించి బుర్రపాడు చేసుకోకు పంతులూ" అంటూ ఓదార్చాడు వీరాస్వామి.

"ఆలోచించడం లేదోయ్, ఏమిటో అలా చూస్తూవున్నానంతే" అని దృష్టి వీరాస్వామి మీదకి మళ్ళించారు రామయ్య పంతులు. బలమైన శరీరం, జబ్బుకి నాటులా ఒక గీతవుండి పోయింది—తాయెత్తు జైలులో తీసేశారు కాబోలు. జైలు యూనిఫారంలో వీరాస్వామి గమ్మత్తుగా వున్నాడు; తెల్లటి మల్లు పంచె, అడయారు లాల్చీలో ఎప్పుడూ చూసే రామయ్య పంతులు కూడా జైలు యూనిఫారంలో గమ్మత్తుగా కనిపించాడు వీరాస్వామికి.

"ఏం పంతులూ అట్టాఅట్టా పెద్దపెద్దోళ్లతో విందులుచేసేవాడివే, యిప్పుడీ జైలుకూడెలా తిన కలుగుతున్నావోకదా!" నిట్టూర్చాడు వీరాస్వామి.

"చూడు పంతులూ, పొద్దుట పెరేడులో సూపరెంటు అడిగినప్పుడేనా చెప్పకూడదూ, యిక్కడ సరిపడ్డంలేదని" నువ్వొక్తి చేతకాని వాడిలా వున్నావు. నాకే అలాంటి ఛాన్సువస్తేనా, అన్న ధోరణిలో అన్నాడు వీరాస్వామి.

"పోనిలే వీరాస్వామీ, ఇక్కడే బాగుంది—మీ అందరి మధ్యా-యిక్కడికి తీసుకొచ్చిన రోజు...ఆ మొదట్లో గదిలోవుంచారు. ఆ రాత్రి రాత్రి కాదనుకో తెల్లారు ఝామున..."

"నాకు తెలుసు పంతులూ, ఆగోడ కావలే ఉరి తీసేచోటు- రాత్రి ఎవర్నేనాఉరి తీసేరా?"